# జీవన రాజకీయం

తళతళ మెరుస్తున్న తన స్కూటర్ని తనివి తీరా మరొక్కసారి చూసుకుని జేబురుమాలు తీసి సున్నితంగా వ్యూ మిర్రర్ తుడిచి, స్టాండు తీసి స్టార్ట్ చేసి రెండుసార్లు హారన్ మోగించాడు మోహన్. ఆ రోజు ఫిబ్రవరి 24వ తేదీ. మోహన్ కొత్త స్కూటర్ మీద మొదటిసారి బయలుదేరబోతున్నాడు.

తార ఇంట్లోంచి కాలు బయటికి పెట్టబోయి, చటుక్కున ఆగిపోయింది. ఒక్కసారి భూమి కంపించినట్టు, నేల చీలుకుపోతున్నట్టుగా, ఇంటి కప్పు పెళ్ళలు పెళ్ళలుగా కూలి మీదపడుతున్నట్టుగా - ఆమె బాధతో మెలికలు తిరిగింది. కళ్ళు గిర్రుమని తిరిగాయి. కాళ్ళు, దడదడలాడిపోయాయి. పొద్దుట నుంచీ సన్నగా బాధిస్తున్న పొత్తి కడుపులో నొప్పి, ఒక్కసారి వికృతరూపం దాల్చి, కొండ చిలువ కదిలి నట్టయి, కడుపు చీల్చుకుని ఏదో ఏలియన్ బయటకొస్తున్నట్లనిపించింది. బాధతో వొళ్ళంతా చెమట ముద్దవడమే కాకుండా వెచ్చగా బట్టలన్నీ భళ్ళున తడిపేసాయాయి.

''అమ్మా...'' అంటూ పెద్ద కేక పెట్టి అక్కడే కూలబడబోయి తలుపు సాయంతో నిలతొక్కుకుంది. వెనుకనుండి తలుపేసుకోవడానికి వచ్చిన అత్తగారు చటుక్కున పట్టుకుని ''ఏమమ్మాయ్ ! ఏమైందీ' అంది కంగారుగా –అ ంతలో ఆమె పరిస్థితి గ్రహించి 'అదేమిటంటూ' గుట్టుగా పాదివి పట్టుకుని లోపలికి నడిపించు కెళ్ళింది.

ఈ హడావిడి చూసి మోహన్ స్కూటర్ స్టాండ్ వేసి లోపలికొచ్చాడు.

. ★ ★ ★ ★

తార హాస్పిటల్ బెడ్మీద నీరసంగా పడుకుని ఆలోచిస్తోంది. ఆమెకి బ్లీడింగ్ అవుతున్నా, బాధ తగ్గింది. గర్భం పోయినట్టేనని లేడీ డాక్టర్ ధ్రువపరిచింది. ఆ విధంగా డాక్టర్ సర్టిఫికెట్ తీసుకుని, దీనికి సెలవు కాగితం జత చేసి పంపింది ఆఫీసుకి. అబార్షన్కి ఇచ్చే ఆరు వారాల స్పెషల్ లీవు కోసం విహంచి భారతి ఎప్పుడొచ్చి ఆఫీసు విశేషాలు చెప్తుందా అని చూపులు గుమ్మానికి తగిలించి పడుకుంది.

రకరకాల ఆలోచనలు మనసులో సాగుతున్నాయి. జీతం డ్రా చేశారా ? తను

రకరకాల ఆలోచనలు మనసులో సాగుతున్నాయి. జీతం డ్రా చేశారా ? తను భారతికి పే ఆథరైజేషన్ ఇచ్చింది కనుక ఆమె తప్పకుండా ఆ డబ్బు ఇవ్వడానికి వస్తుంది.

తార నీరసంగా కళ్ళు మూసుకుంది. కళ్ళ ముందు ఏవేవో రూపాలు, చెవుల్లో ఏవేవో సంభాషణలు, ఆఫీసులో కూర్మారావు, రామనాథం, రంగారావు, ఒక్కొక్కసారి వాళ్ళు మాట్లాడే టొంపుమాటలు - వాళ్ళు విసిరే కామెంట్లు గుర్తుకొచ్చి బాధగా నవ్వుకుంది.

ఉద్యోగం చేస్తున్న స్త్రీల మీద ఛలోక్తులు విసరడానికి, విమర్శలు కురిపించడానికి అందరూ ముందుగానే ఉంటారు.

''ఆడవాళ్ళమై పుట్టినా బాగుండేది. హాయిగా నెలల తరబడి సెలవు మీద ఫుల్ జీతం తీసుకుంటూ ఇంట్లో విశ్రాంతి తీసుకోవచ్చు'' -

ఆఫీసులో మెటర్నిటీ లీవు ఎవరు పెట్టినా, గర్భస్రావమై స్పెషల్లీవు మీద ఎవరు వెళ్ళినా ఎవరో ఒకరైనా ఈ కామెంట్ చేయకమానరు.

తారకి ఎప్పుడు పట్టిందో బాగా నిద్రపట్టేసింది. ఎనిమిది గంటలు దాడుతుండగా తార తల్లి వైదేహి అన్నం క్యారేజి పుచ్చుకొచ్చింది. తల్లిని చూడగానే తారకి ఎక్కడిదో దుఃఖం ఒక్కసారి పొంగుకొచ్చింది. వైదేహి కూతుర్ని పొదివి పట్టుకొని ''ఏం లేదు. ఏముందిందులో? అంత బాధపడాల్సిందేమీ లేదు - పోతే పోయింది లే'' అంటూ ఓదార్చింది.

''నువ్వెప్పుడొస్తావా అని చూస్తున్నాను'' అంది కళ్ళ నీళ్ళతో తార.

''నాకు నిన్న లెటర్ అందింది. మధ్యాహ్నం బయలుదేరాను'' అంటూ సముదాయించింది.

★ ★ ★ ★

తార ఎకనామిక్స్ ఎం. ఎ. చేసింది. అందులో గోల్డ్‌మెడల్ తీసుకుంది. కాంపిటేటివ్ టెస్టులో నెగ్గు కొచ్చింది. ఇంటర్వ్యూలో పక్కన పెట్టేయకుండా తండ్రి రమేష్‌బాబు బందోబస్తు చేశాడు. అందుకే తార ఇప్పుడు బంగారు బాతు. బంగారు బాతు కాబట్టే మోహన్ ఆర్థిక వ్యూహాలను తట్టుకుని, అతని పెళ్ళి కూతుళ్ల ఎంపికలో నెగ్గుకొచ్చి అతని భార్య అయింది.

భారతి వస్తూనే ''సారీ తారా ! నిన్న రాలేకపోయాను. మా చంటి వాడికి

ఉదయమే కొంచెం జ్వరం తగిలింది. మధ్యాహ్నం మరీ ఎక్కువైందని ఫోను వస్తే వెళ్ళిపోయాను. అయినా మోహన్ వచ్చి నీ సేలరీ తీసుకెళ్ళారు కదాని, ఈ రోజు రావచ్చులే అనుకున్నా'' అంది.

సైలెన్సర్ అమర్చిన పిస్తోల్ గుండు నిశ్శబ్దంగా గుండెల్లో దూరినట్టయింది తారకి. పైకి వినిపించనంత మాత్రాన బుల్లెట్ తక్కువ బాధేం పెట్టదు. భారతి రాలేకపోయినందుకేం బాధ లేదు గానీ తన జీతం తీసుకున్న మోహన్ కనీసం రాత్రయినా ఒక్కసారి అస్పత్రికొచ్చి తనకి కనిపించలేదని విపరీతమైన బాధ గుండెలంతా నిండిపోయింది.

''ఎప్పుడెళ్ళిపోతున్నావ్'' అంది భారతి.

''ఈ రోజు సాయంత్రం – అంటే మరో గంటలో''

''అయితే సర్లేగాని నేను శెలవు పెట్టాను. నెల్లాళ్ళు'' –

''అబ్బ. ఎందుకు ?''

''మా అన్నయ్య రమ్మని రెండేళ్ళ నుంచి గొడవ –''

''హాయిగా వెళ్ళిరా''

''ఇదిగో నీ పే స్లిప్ – మరి నేవెళ్తానింక'' అంటూ భారతి వెళ్ళిపోయింది.

భారతి వెళ్ళిపోయాక, విచిత్రమైన అవమానంతో కూడిన గుబులు తార మనసంతా కమ్ముకుంది.

★ ★ ★ ★

ఏమిటీ ? ప్రతీ చిన్నదానికీ రాద్ధాంతం చేస్తావు ? ఏం ? నీ జీతం నేవెళ్ళి తీసుకుంటే తప్పా ? నీకేమైనా నామోషీయా అన్నాడు చిరచిరలాడుతూ మోహన్.

''నాకొక్కమాట చెప్పాలి కదా!''

''ఇప్పుడు చెప్తున్నాను కదా!''

''ఏమిటీ ? ఇప్పుడా ? నేనడిగాక, ఇంత నిష్ఠూరం పడ్డాక'' అంది చిరాకుగా–

''భార్యాభర్తల మధ్య ఆ మాత్రం Understanding వుండకపోతే కష్టం'' అన్నాడు.

''నేనూ అదే అంటున్నా'' అంది కఠినంగా –

మోహన్ మరేం మాట్లాడలేదు. ఆ రోజు తన తల్లిని హాస్పిటల్‌కి బండి మీద

దింపి, లోపలికి రాకుండా వెళ్ళిపోయి, ఇప్పుడేదో కథలు, కబుర్లు చెప్తున్నాడని తారకి ఉక్రోషంగా, కోపంగా ఉంది.

పరిస్థితి గ్రహించిన వైదేహి కూతుర్నే కేకలేసింది.

అతనికేదో పనుందని, మళ్లీ లోపలికొస్తే ఆలస్యమవుతుందని వెళ్ళాడే - ఇప్పుడేమైందనీ గొడవా అంటూ అల్లుడ్నే సమర్థించింది.

★★★★

లీవు పూర్తవుగానే తార ఆఫీసుకెళ్ళడం మొదలు పెట్టింది. తన సీటులో పని నిలవ పడిపోయిందని, ఆఫీసు టైము అయ్యాక కూడా చేయడం ప్రారంభించింది.

ఆరోజు ఒళ్ళు భారంగా ఏలాగో అనిపిస్తూంటే లెక్కలు చూసుకుంది - పీరియడ్స్ రాలేదని గ్రహించి ఎందుకా అని ఆలోచనలో పడింది. అత్తగారితో అదే మాట అంది.

''అ... మొన్నటి దాకా చాలా బ్లడ్ పోయింది కదా - కొన్నాళ్లు ఆగుతుంది. భయం లేదులే'' అందామె. నిజమే కదా అని ఊరుకుంది. రెండు నెలలు దాటి పోతుంటే వంట్లో భారం ఆమెకి అనుమానం కలిగించి లేడీ డాక్టరు దగ్గరకెళ్ళింది. డాక్టరు తారకి ప్రెగ్నెంటని నిర్ధారణ చేసి మందులు రాసిచ్చింది. తార ఆశ్చర్య పడలేదు. అనందమూ పొందలేదు గానీ ''మూడో నెల వచ్చిందంటారా'' అనంది.

''లేదమ్మాయ్ - ఎడ్వాన్స్‌డ్ - అయిదు నెల్లు దాటినాయి'' అంది.

''అదెలా నాకు మూడు నెలల క్రితం అబార్షనైంది.

''నో.. ఇట్స్ నాట్ కరెక్ట్'' అంటూ మందుల చీటి చేతిలో పెట్టి, ఇంక వెళ్ళచ్చు అన్నట్టు నవ్వింది. స్కూటరు వెనుక కూర్చుని నెమ్మదిగా మోహన్‌తో చెప్పింది.

''పోన్లే యిప్పుడు నీకొచ్చిన కష్టమేంటి?'' అన్నాడు మోహన్.

''ఏం లేదనుకోండి - అప్పుడు చూసింది డాక్టరు లలిత. ఆమె ఆమెరికా వెళ్లే హడావిడిలో ఉన్నారు. రెండుసార్లు ట్రై చేసినా దొరకలేదు'' నెమ్మదిగా అంది తార.

ఇప్పుడు నీ ప్రాబ్లమ్ ఏమిటో అర్థం కావడం లేదు అన్నాడు భుజాల మీదుగా వెనక్కి తిరిగి విసుగ్గా -

అతనికి త్వరగా విసుగు – విసుగు పెరిగిన కొద్దీ కంఠం పెద్దదవడం లక్షణాలు – వెంటనే తార సర్దుకుంది ''నో ప్రాబ్లమ్'' అంది.

నాలుగు రోజుల తర్వాత భారతిని తోడుగా తీసుకుని బాగా అనుభవం కల డాక్టరు మహాలక్ష్మి గారి దగ్గరకెళ్ళింది తార. వీళ్ళు వెళ్ళేసరికి ఆమె కాస్త విశ్రాంతిగానే ఉంది. భారతికి ఆమె పూర్వమే తెలిసి ఉండటం వల్ల చనువుగా పలకరించింది.

ఆమె తారని పరీక్ష చేసి, అయిదో నెల దాటిందనీ సెప్టెంబరు ఇరవై డెలివరీ డేట్ ఇచ్చింది. తార నెమ్మదిగా అసలు జరిగిన కథ చెప్పింది.

''ఓ అదా. ఒక్కొక్క సారలా జరుగుతుంటుంది. Implantation – అంటే Fertilised Egg గర్భసంచిలో ఒక పక్కగా ఒక ప్రదేశానికి చేరి ఉండిపోతుంది. అప్పుడు కొందరికి బాగా రక్తస్రావం అవుతుంది. దాన్ని Post abortal Bleeding గా పొరబడితే ఇలాంటి అనుమానం వస్తుంది. కానీ అప్పుడు పిండం ఏం కాదు క్రమంగా పిండం పెరిగి బిడ్డ పుట్టవచ్చు – అదే జరిగింది'' అంది డాక్టరమ్మ. ఆ మహాలక్ష్మి గారికి వైద్యంలో ఎంత అనుభవం ఉందో, ఆసక్తి చూపించిన వారికి అన్నీ విపులంగా చెప్పే అంత ఉత్సాహం, ఓర్పు కూడా ఉన్నాయి.

సెప్టెబరు పది వరకు ఆఫీసుకెళ్ళిన తార పదకొండు నుంచి మెటర్నిటీ లీవ్ అప్లై చేసింది.

ప్రస్తుతం తారకి పుట్టబోయే బుజ్జి పాపాయి కోసం ఎదురు చూడ్డం తప్ప వేరే వ్యాపకం ఆలోచన లేదు.

★ ★ ★ ★

ఆ రోజు పాపకి బారసాల. ఇరువైపుల బంధువులతో ఇల్లంతా కలకల్లాడుతోంది. పాపకి భాగ్యశ్రీ అని పేరు పెట్టారు. అత్తగారూ, మామగారూ తన హోదాకి తగిన బట్టలు పెట్టలేదేమోనని అనుమానంతో మోహన్, తన కిచ్చిన బట్టలు రహస్యంగా చూసు కుంటున్నాడు.

అందరూ భోజనాలయి తాంబూలాలు వేసుకుని కులాసా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఇంతలో పోస్ట్‌మెన్ వచ్చి, తార పేరున ఒక రిజిష్టర్డ్ కవరిచ్చి వెళ్ళిపోయాడు. ఒక్క క్షణం వాతావరణం నిశ్శబ్దమైంది. ఆఫీసు నుంచి వచ్చింది ఏమై ఉంటుందా అని తార తండ్రి రమేష్ బాబు అది చదివి నిర్ఘాంత పోయాడు.

తార అయిదు నెలల క్రింత దొంగ సర్టిఫికెట్ పెట్టి, అబార్షన్ అనే వంకతో ఆరువారాలు ప్రత్యేక శెలవు తీసుకుని అది పూర్తయిన అయిదు మాసాలకే మెటర్నిటీ లీవు తీసుకున్నారని – ఇది డిపార్డుమెంటుని మోసం చెయ్యడం కనుక, మీ సంజాయిషీ అడుగుతూ షోకాజ్ నోటీస్ అది.

ఇంటిలోని పండగ వాతావరణం గంభీరమై, విషాదంగా మారి పోయింది. అసలు జరిగిన విషయం పూర్తిగా తెలుసుకున్న రమేష్‌బాబు మహాచిరాకు పడి పోయాడు. మోహన్ అయోమయంలో పడిపోయాడు. తారకి ఒక్క క్షణం బుర్రంతా మొద్దుబారి పోయి నట్లయింది.

వెంటనే రమేష్ బాబు రంగంలోకి దిగాడు. కూతురి ఉద్యోగం నిలబడాలని కంకణం కట్టుకుని బయలుదేరాడు.

తెలియక జరిగిన పొరబాటని ఎంత చెప్పినా పై అధికారులు వినలేదు.

డాక్టరు దగ్గర మీకా విషయం బయట పడినప్పుడు అదే విషయం డిపార్టుమెంట్‌కి తెలియబరచి, మీ ప్రత్యేక సెలవును మరో లీవుగా మార్పించుకోవాలి కదా – అది ఉద్యోగి కనీస బాధ్యత. ఆ బాధ్యతని విస్మరించి, సంస్థని చీట్ చేద్దామని చూసినందుకు రిమూవల్ తప్పదన్నారు.

రమేష్ బాబు మొదట చెక్ చేసిన డాక్టర్ లలిత కోసం ప్రయత్నించాడు. ఆమె పొరబాటైందని రాసిస్తుందని ఆశించడం తెలివి తక్కువని తేలిపోయింది. ఆమె విదేశాలకి వెళ్ళిపోయే హడావిడిలో ఉంది –

ఆఫీసులో కొందరు అధికారులు, సెక్షను హెడ్డులు కేసు బాగా పకడ్బందీగా ఫ్రేమ్ చేయడం వల్ల రమేష్ బాబు ఎంత ప్రయత్నించినా లొంగలేదు. తారని ఉద్యోగంలోంచి తీసేస్తూ ఆర్డరు వచ్చేసింది.

ఆ రోజు మోహన్ వచ్చి తార మీద తాడెత్తున లేచాడు.

''ఉద్యోగం చేస్తున్నామని పెద్ద ఫోజు. రూల్సు తెలీవు. రెగ్యులేషన్సు తెలీవు. ఆడవాళ్ళ నేమైనా అంటే మాత్రం పౌరుషం పొడుచుకొస్తుంది'' అంటూ ఏవేవో మాట్లాడాడు.

''నేనా విషయం ఎంతో ఆందోళన చెందాను. మీకు గుర్తుందా'' అంది తార.

''ఏం లాభం?'' వ్యంగ్యంగా అన్నాడు మోహన్.

''నేను డాక్టరు మహాలక్ష్మి గారి దగ్గర కెళ్ళే వరకూ ఊరుకోలేదు. కానీ నాకా విషయం ఆఫీసుకు తెలియపరచాలని తోచలేదు''.

''అదే అడుగుతున్నాను ఆ మాత్రం తెలీదా?''

''అవును నాకు తోచలేదు, నిజమే, మీరు చెప్పచ్చు కదా – మీకు రూల్సు, రెగ్యులేషన్లు బాగా తెలుసుగా'' అంది.

''ఆహా.. నాకింకేం పనిలేదా – ఇలాంటి చిన్న విషయం కూడా నే చెప్పాలా''

''ఏం ఇదేమంత చిన్న విషయం కాదే,– నా ఉద్యోగానికి ముప్పుతెచ్చిన విషయం'' –

''నాకేం తెలుసు, నువ్వేం చెప్పుకున్నావో నీ ఆఫీసులో – ఏమడిగినా, నీ విషయంలో కల్పించుకున్నట్లుంటుందనీ...''

''మీకు జరిగింది జరిగినట్టు చెప్తూనే ఉన్నాను. మీరు నన్ను గైయిడ్ చెయ్యొచ్చు కదా! నాకు నెలలు తేడా వచ్చినప్పుడు మీకు చెప్పలేదా?''

''ఏమో ! నాకేం గుర్తు, నాకు నీ ముట్టు నెలలు గుర్తు పెట్టుకోవడమే తప్ప వేరే పన్లేదనుకున్నావా''

ఒక్కసారి తారలో కోపం తారస్థాయినందుకుంది. ఇంతవరకు ఆమె తన భర్తలో ఎన్నో నీచగుణాలు చూసినా, గ్రహించినా ఇంతటి నీచమైన మాటలు మాట్లాడగలడని ఊహించలేదు. ఆమెలో సహనం నశించింది.

''అవును, నా ముట్టు నెలలు లెక్కపెట్టడానికి, గుర్తుపెట్టుకోడానిక మీకెక్కడ గుర్తు ? నా జీతం డబ్బులు మాత్రం బాగా లెక్కలు కట్టి, జేబులో వేసుకోడానికి కుదురుతుంది గానీ'' అంది. తార చెంప చెళ్ళుమంది. మరో దెబ్బపడేదే – కాని తార అతని చెయ్యి గట్టిగా పట్టుకొని ''మరొక్క దెబ్బ నా వంటిమీద పడిందో మీ అంతు చూస్తాను'' అంది కళ్ళల్లో నిప్పులు కురుస్తూ. ఈ గొడవకి లోపలి కొచ్చిన ఆమె తండ్రి కూతుర్ని చిన్నగా మందలించి అల్లుడ్ని అక్కడ్నించి బయటకు తీసుకెళ్లే ప్రయత్నంలో పడ్డాడు.

మామగారు సముదాయించే సరికి మరీ రెచ్చిపోయి, జేగురించిన ముఖంతో పెద్ద పెద్ద రంకెలు వేయడం మొదలు పెట్టాడు మోహన్.

కూతురి ఉద్యోగం పోయినందుకే బాధపడాలో, అల్లుడిలా అరుస్తున్నందుకు బాధపడాలో రమేష్ బాబుకి అర్థం కాలేదు.

''ఇదిగో మావయ్యగారూ..! ఇప్పుడే చెప్తున్నా - నేను ఉద్యోగం చేస్తున్న అమ్మాయి కావాలని ఏరి చేసుకున్నాను. అది నా కండిషన్లలో ఒకటి. ఇప్పుడు ఉద్యోగం పోగొట్టుకుని కూర్చుంది. దానికి నా బాధ్యత లేదు. ఉద్యోగం కనుక లేకపోతే మీ అమ్మాయికీ నాకూ ఎటువంటి సంబంధం ఉండదు'' అంటూ ఇష్టమొచ్చినట్టు అరిచాడు.

''అదేమిటలా మాట్లాడుతావు మోహన్..! సమస్యలొచ్చినప్పుడే, స్థిమితంగా ఆలోచించుకోవాలి - వాటిని పరిష్కరించుకోవాలి. అంతేగానీ...'' అతని మాట పూర్తికాకుండానే మోహన్ అందుకున్నాడు.

అవన్నీ నా కనవసరం. ఎలా పరిష్కరించుకుంటారో ఏం చేస్తారో - మళ్ళీ ఎలా ఉద్యోగం వేయిస్తారో నాకు తెలీదు, ఆ ఉద్యోగం మళ్ళీ వేయించలేక పోతే మీ అమ్మాయిని మీ ఇంట్లోనే ఉంచుకోండి'' అన్నాడు విసురుగా.

రమేష్‌బాబుకి చర్రున కోపమొచ్చింది. అతని జీవితానుభవం అతని కోపాన్ని మింగేసింది. ఇది కూతురి ఉద్యోగ సమస్యగా కాకుండా ఆమె సంసార జీవన సమస్యగా మలుపు తిరగడం అతన్ని కంగారు పెట్టింది. తార మాత్రం స్తబ్దుగా, రాయిలా ఉండి పోయింది. ఆమె మోహన్ వైపు చూసిన చూపులో ఏ భావం ఉందో చెప్పడం కష్టం - అది కోపమా ! అసహ్యమా ! జీవిత సత్యాన్ని గ్రహించిన తెరిపితనమా ఏమో ! కానీ ఆమె కళ్ళు చెమ్మగిల్ల లేదు. ఆమెకసలు ఏడుపు రాలేదు.

★ ★ ★ ★

అంతవరకు రంగురంగుల బట్టలు కట్టిన రబ్బరు బొమ్మలాగా పెరిగిన తార ఒక్కసారి రక్తమాంసాలు గల మనిషిగా, ఆలోచనగల అమ్మాయిలా, ఇష్టా ఇష్టాలు గల స్త్రీలా కళ్ళు తెరచింది. చిన్నప్పటి నుంచి తల్లి చెప్పినట్టుగా వినడం, తల్లి ఆలోచనలతో నడవడం మాత్రమే తెలుసు తారకి. తానుగా ఏదీ ఆలోచించలేదు. అలా ఆలోచించాల్సిన అవసరమూ రాలేదు. కట్టూ, బొట్టూ, నగలు, ఫ్యాషను బంధువులు, మిత్రులు అన్నీ అమ్మ చెప్పినట్టుగానే జరిగిపోయేవి. చదువు - సబ్జక్టు, పరీక్షలు, మార్కులు, ఫస్టు క్లాసులు, గోల్డు మెడల్స్, కాంపిటేటివ్ టెస్టులు, ఇంటర్వ్యూలు ఇవన్నీ నాన్న చెప్పినట్టుగా జరిగిపోయాయి.

తన సాటివారిలో తను ఎక్కువగా ఉండాలని అర్థం చేసుకుంది. ఏలోటూ లేకుండా కాన్వెంటు చదువు పూర్తి చేసింది. ఆ తర్వాత కాలేజీలో చేరే సరికి అందమైన బట్టలు, అంతస్థులు, హోదాలు అర్థమయ్యాయి. బి. ఎ. చివరి సంవత్సరంలో ఉండగా ఇంట్లో పెళ్లి కబుర్లు సాగుతుండేవి. తారకవి అత్యంత సహజంగా అనిపించేవి.

''ఇదిగో ఇలా ఉంటే నీకు పెళ్లి కాదు'' అంటే తల్లి – మర్నాటి నుంచి తార ఆ తప్పు దిద్దుకుని ప్రవర్తించేది. ఎలా ఉంటే తనకి పెళ్లి బాగా అవుతుందంటే అలాగే ఉండేందుకు ప్రయత్నించేది.

''ఈ రోజుల్లో చదువు ఒక్కటే ఉంటే చాలదు. ఉద్యోగం కూడా ఉంటేనే మంచి సంబంధం వస్తుంది'' అన్న వెంటనే పట్టువదలకుండా ఉద్యోగం సంపాదించుకుంది. జీతం బ్యాంకులో వేసుకుని కట్నం కూడబెట్టుకుంది.

భర్త అంటే ఎత్తుగా, అందంగా – చదువు, ఉద్యోగం, హోదా, కట్నం, కానుకలు, లాంఛనాలు వగైరాలే అని ఆలోచించింది కానీ, మనిషి, అతనిలోని భావాలు, అతని ఆలోచనా ధోరణి, సమభావం, ప్రేమ, ఇలాంటివెప్పుడూ ఆలోచించలేదు.

పిల్లవాడు మంచివాడు – బుద్ధిమంతుడు అని అందరూ సర్టిఫై చేయడం వింది–

'మంచి' అంటే ఏమిటి

బుద్ధిమంతుడు అంటే ఎలా ఉంటాడు అనేది తార ఎప్పుడూ ఆలోచించలేదు. తల్లిదండ్రుల ఎంపికలో మోహన్ సహజమైన, అన్ని అర్హతలూగల యువకుడు – పెళ్లి కొడుకు – ఇప్పుడు తారకి మొగుడు.

అసలు తారకి తనకేం కావాలో తనకే తెలీని స్థితిలో ఉంది. అదే తెలిస్తే, ఆ కావాల్సిన దాని కోసం అతని దగ్గర వెదికేది.

తారకిప్పుడే తను కోల్పోయిన వ్యక్తిత్వం అర్థమవుతోంది. అలా అర్థమవడం మొదలు పెట్టగా, విపరీతమైన అసంతృప్తి ఆమె మనసుని కాల్చిపారేస్తోంది.

రమేష్‌బాబు రంగప్రవేశం చేశాడు. ఆఫీసులో కొందరు ఆడవాళ్ళ మీద కేవలం ఈర్ష్యాసూయల కొద్దీ, ఈ కేస్ బాగా భూతద్దంలో పెట్టి చూపించి, ఫ్రేమ్ చేశారు.

'వంద రూపాయలు పడేస్తే డాక్టరు ఏ సర్టిఫికెటైనా యిచ్చే ఈ రోజుల్లో ఇదేమంత కష్టం కాదని, తార డిపార్టుమెంటుని చీట్ చేసి, ప్రత్యేక శలవు వాడుకుంది' ని నిరూపించారు.

అవన్నీ తిరగతోడించి, అందర్నీ ఒప్పించి, బతిమాలి, పాతికవేలు ఖర్చుచేసి, ఆరేళ్ళ సర్వీసు పోగొట్టుకుని, ఫ్రెష్‌గా అప్పాయింట్‌మెంట్ సంపాదించేసరికి రమేష్ బాబు లాంటి వ్యవహారం తెలిసిన మనిషికే ఏడాది పట్టింది.

రోజులు, వారాలు, నెలలు గడిచే కొద్దీ తారలో ఆలోచన పదునైంది.

ఏడాదిలోను మోహన్ తారని చూడటానికి రెండు మూడుసార్లు వచ్చాడు. ఇద్దరి మధ్యా పొడిపొడి మాటలు జరిగాయి. అతను రమ్మనమని అడగలేదు. ఆమె వస్తానని ఆత్రం చూపించలేదు.

ఆరోజు రమేష్‌బాబు ఆనందంతో ఆటోలోంచి దూకినంత వేగంగా దిగి చకచకా ఇంట్లోకి జొరబడ్డాడు.

''తారా ! అమ్మా తారా – తల్లీ తారా'' అంటూ అతని గొంతు ఆవేశం ఆనందం కలిసి గుడిలో గంటలా మోగింది. వైదేహిలోపల్నించి హడావిడిగా వచ్చింది.

''వైదేహీ, మన కష్టాలు గట్టెక్కాయి. ఇదిగో తార ఉద్యోగం ఆర్డరు'' అన్నాడు.

లోపల గదిలో కూర్చునేదో పుస్తకం చదువుకుంటున్న తార పరుగున హాల్లోకి వచ్చింది.

''ఇదిగో నమ్మా – నీ ఆర్డరు''

ఆమె ఆత్రుతగా అందుకుంది – కళ్ళల్లో చివ్వున చిమ్మిన నీటివల్ల ఏం కనిపించ లేదు.

''రేపే జాయిన్ అవుదువుగానీ – రేపు మంచి రోజు కూడా''

''అలాగే నాన్నా'' అంది. ఆమె గొంతు ఒణికింది. దుఃఖంతో పూడుకు పోయింది.

ఆ తల్లిదండ్రులామె బాధనర్థం చేసుకుని, నిట్టూర్చారు.

★ ★ ★

ఇంట్లో అడుగుపెట్టిన అల్లుడికి ఎంతో మర్యాద చేసింది అత్తగారు వైదేహి.

గౌరవంగా ఆహ్వానించి ఉత్సాహంగా కబుర్లు చెప్పాడు మామగారు రమేష్‌బాబు.

అప్పుడే వచ్చింది తార–

''తారా ! ఎల్లుండి మంచిదట. అమ్మ చెప్పింది. మనింటి కెళ్దాం'' అన్నాడు మోహన్.

రమేష్‌బాబు ముఖంలో ఏదో తృప్తి, వైదేహీ ముఖంలో ఒక రకమైన రిలీఫ్ –,

''నేను రాను'' అంది తార. ఆ కంఠంలో కోపం, ఉద్రేకం లేవు. దృఢ నిశ్చయం ఖంగుమని మోగింది.

రమేష్ బాబు, వైదేహి ఒక్క క్షణం వెనక్కి జంకారు.

మోహన్ ముఖం వివర్ణమైంది.

''అదేమిటమ్మా...'' అని ఇంకా ఏదో చెప్పబోయిన తండ్రి మాటకి అడ్డొచ్చి–

''నాన్నా ! అదంతే, నా ఉద్యోగం నాకిప్పించి బతుకు తెరువు నిచ్చారు. మీ రుణం జన్మలో తీర్చుకోలేను. కానీ ఈ మొగుడితో వెళ్ళి కాపురం చెయ్యమని మాత్రం అడక్కండి'' –

''తారా...'' తల్లి ఏదో అనబోయింది.

మోహన్ ఒక వెర్రినవ్వు లాంటిది నవ్వాడు. దొంగతనం చేస్తూ పట్టుబడిన వాడు కప్పిపుచ్చుకునే ధోరణిలా –

''ఏదో నేను ఆవేశంలో అన్నమాటలు పట్టించుకున్నట్లుంది.

భార్యాభర్తలన్నాక...

''స్టాప్ ఇట్. ఇంక చాలు మరేం మాట్లాడకండి. నేనీ జన్మలో మీ దగ్గరికి రాను. మీతో జీవించను''–

''ఏమనుకుంటున్నావో..''

''నేనేమనుకున్నా మీ కనవసరం – విడాకులికి ప్రయత్నించుకోండి – కాదంటే నేనే చేస్తాను''

మరింక ఒక్క క్షణం కూడా అక్కడ నిలబడలేదు తార. విసురుగా తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంది.

ఆంధ్రజ్యోతి డైలీ

*19 ఫిబ్రవరి 1995*